

"ఏమండోయ్ లేవండి అబ్బా, త్వరగ లేవండి" అంటూ కుదుపుతున్న శ్రీమతి ముఖంలోకి చిరాగ్గా చూస్తూ ఏ . . గాలికో దొడ్డి తలుపులు కదిలిన చప్పుడో లేక, ఏ పిల్లో వంటింట్లో చేసిన చప్పుడుకో భయపడి ఇలా నిద్ర భంగం చేసే భార్య అలవాటును తిట్టుకొంటూ , ఏం లేదు లేవే పిల్లి వచ్చుంటుంది పడుకో, అంటూ అటు వైపు తిరిగాడు రాజీవ్‌కుమార్

"అయ్యో అది కాదండి వీధి కొళాయిలో నీళ్లొస్తున్నాయ్." అంటూ మరోసారి కుదిపింది

అంత వరకూ వున్న నిద్రకాస్తా, ఆ ఒక్క మాటతో తెల్లారి పోయినట్లయ్యింది

"ఆ నిజమా? సరిగ్గా చూసావా?" అంటూ లేచి కూర్చున్నాడు రాజీవ్.

"నిజమండి, పక్కింటి వనజా వాళ్లు అప్పుడే వెళ్లా"రంటూ, బిందెలు నాలుగూ, వున్న రెండు చేతుల్లో సంధించి, త్వరగా రండి అంటూ బయలుదేరింది



# ఓ కొళాయి కథ!

రాయల చంద్రమౌళి



అహో ఎమిస్వామి నీ లీల అంటూ అంతవరకూ గోడపై వ్రేలాడుతున్న ఎడు కొండల వాని పటం వైపు చూస్తూ చేతులెత్తి నమస్కరించాడు కొళాయిలో నీళ్ళు కాక రాళ్ళు వస్తాయా? అని ఎవరికైనా సందేహం చాలా తొందరగా రావచ్చును అలా ఆ వీధి కొళాయిలో నీరు రావడం నిజంగా ఆ వూరివింతల్లోని అతి ముఖ్యమైన వింత

ఆ పట్టణానికి ఎడు సంవత్సరాల స్పెషల్ ఆఫసర్ గారి పాలన నుండి మునిసపల్ ఎన్నికలు జరిగి చైర్మన్ ఎన్నిక వగైరాలన్నీ దిగ్విజయంగా సాగిన మొదటి నెలలో ఆ వీధిప్రజలు తమ అమూల్య మైన ఓట్లు వేసి గెలిపించిన వార్డు కౌన్సిలర్ గారి వద్దకు పదిసార్లు తిరిగి అతి కష్టంతో రెండేండ్ల క్రిందట సాధించు కొన్నదే ఆ బుజ్జి కొళాయి

ప్రజలు ఎంతో ఆశతో వేయించుకొన్న ఆ కొళాయి వారి ఆశలను అడియాశలుగా మార్చి ఇక చూస్కోండి నా తడాఖా అంటూ మొరాయించింది అది మూణ్నాల ముచ్చటగా మారింది

అది ఏ శుభ ముహూర్తంలో సమ్మె ప్రారంభించిందో కానీ ఇంతవరకూ దిగ్విజయంగా సాగుతూ వచ్చింది

అయ్యో మీరేయించిన కొళాయి పద్ధతి ఇలా తగలడింది అంటూ కౌన్సిలర్ గారి వద్దకు పరిగెత్తిన ప్రజలకు ఆయన వారం రోజులుగా కనిపించడం లేదనే విషయం ఆయన శ్రీమతిగారు చిరునవ్వుతో తెలియ జేసింది

ఆడేంటి! భర్త కనిపించడం లేదనే బాధ కించత్తు కూడా లేకుండా బ్రహ్మాండంగా ముస్తాబై క్రొత్తగా చేయించుకొన్నట్లున్న నెక్లెసును మరి మరి సర్దుకుంటూ ముసి ముసి నవ్వులు దారాపాతంగా పోస్తోందని ఆశ్చర్య పడే వారిని చూస్తూ ఎచ్చి సన్నాసులను కుంటూ చిరునవ్వుతో లోపలికెళ్ళింది

ఆ తరువాత ఆపసు కలిగిన [illegible]

అంతవరకూ వున్న మునిసిపల్ చైర్మన్ గారిపై అవిశ్వాస తీర్మానం పెట్టడం జరిగింది

అంతకు మునుపు చైర్మన్ ఎన్నికలకై జరిగిన తతంగంలో కౌన్సిలర్ల ఆడుకున్న దాగుడు మూతలు, జట్టు మార్పుడులు మొదలైనవి అతని మనస్సులో మెదిలాయి అపుడర్థమయ్యింది. కౌన్సిలర్ భార్యగారు , భర్త కనిపించడం లేదని చిరునవ్వుతో చెప్పిన దానిలో పరమార్థం

ఆ తరువాత ట్యాంకర్ ద్వారా నీరు ఆ వీధికి వచ్చేది కాని ట్యాంకర్ స్టాఫ్ కొద్ది మందిపై చూపిన ప్రేమ, ఎవరింటివద్ద ట్యాంకర్ ఆగాలనే గొడవతో పాటు, ఆ ట్యాంకర్ వచ్చే వేళ నట్ట నడిరేయి కావడంతో (పాపం, మునిసిపాలిటీ కున్నవి రెండే ట్రాక్టర్లు, అవే మొత్తం వీధులన్నీ తిరగాల్సి వుంది అందుకే ఆ వీధికి ఆ సమయం కేటాయించ బడింది ) పగలంతా కంటి చూపుల కలయికలు, సంజ్ఞల వరకే పరిమిత మైన కొన్ని ప్రేమ జంటలు, ఆ సమయాన్ని చక్కగా వినియోగించు కున్నాయి అలా ట్యాంకర్ ప్రేమాయణంతో, నిజ, జీవితంతో కూడా భాగస్వాములైన ముచ్చటైన, మూడు జంటలు ఆ వీధిలో వున్నాయి అనుకున్న విధంగా ఫలితాలు సాధించ లేని జంటల వల్ల నైతేనేమి, సరైన అవగాహన లోపించిన జంటల వల్ల నయితే నేమి, చిలికి, చిలికి, గాలివానలా బిందెలతో మొదలైన పోరాటం కత్తి పోట్ల వరకూ విస్తరించి, బాంబులతో దాడి చేసుకొనే స్థాయి వరకూ పెరగడంతో ట్యాంకర్ అధ్యాయనం పూర్తయ్యింది

మరికొన్ని సార్లు కౌన్సిలర్ చుట్టూ, మునిసిపల్ ఆఫీసు చుట్టూ భ్రమించిన తరువాత, ఆ వీధికి ఒక బోరింగ్ పంపు వేయబడింది

కర్తవ్యం తెలిసిన సిపాయిలా, ఆ బోరింగ్ పంపు తన శాయ శక్తులా, ఆ వీధి వారికి సేవ చేయడం ప్రారంభించింది త్రాగడానికి పనికిరాని దైనా, ఆ నీటినే త్రాగుతూ ఒకటి, అర సార్లు డాక్టర్ల బిల్లులు చెల్లించుకొని అలవాటు పడ్డారు కాలం ఒకేలా సాగితే దాని ప్రత్యేకతంటూ ఏముంటుంది వీధిలోని కొంత మంది దురుసు ప్రవర్తనను, ఓపికున్నంత వరకూ భరించిన కల్ప తరువులాంటి, ఆ బోరింగ్ పంపు ఒక్కసారిగా ఓర్పు నశించి ఇక భరించలేనంటూ నీరసపడింది

ఆ వీధి ప్రజల కష్టాలు మరి మొదటి కొచ్చాయి నీళ్ల సమస్యను ఛేధించ దలచిన రాజీవ్ ప్రతిరోజు ఆఫీసుకు వెళ్లేటపుడు రెండు బిందెలు సైకిలు పై తీసుకెళ్ళి, ఆఫీసులోని బోరింగ్ వద్ద నుండి మధ్యాహ్నం భోజనానికి వచ్చేటపుడు నీళ్ళు తెచ్చేవాడు, అదే విధంగా సాయంత్రం కూడా చేసే వాడు స్వతహాగా పరోపకారం ఇదం శరీరం" అనే సూత్రాన్ని నమ్మిన వ్యక్తి అయినందున అపుడపుడు ఇతరులకు మంచి చేయాలని మునిసిపల్ ఆఫీస్ చుట్టూ తిరిగేవాడు

ఇతని బాధ భరించలేని ఒక సూపర్ వైజర్ బోరింగ్ పంపు మెకానిక్కును పంపాడు భగీరథుడు గంగను సాధించిన తీరులో, ఆ. మెకానిక్కు శ్రేష్టులను

## ఓ..... కొళాయికథ

తరలించి కొసరు త్రోవలో , వారికి కాఫీ, ఫలహారాదులు, ధూమపాన సామగ్రితో పాటు సమకూర్చాడు ఇంత శ్రమ పడ్డ రాజీవ్, గంట తరువాత మెకానిక్ గారి పెదవి, విరుపుతో నీరసించి పోయాడు ఆ పంపును అధికంగా బాధపెట్టి నందువల్ల, లోపలి భాగంలో మట్టి కూరుకున్నందున, రిపేరు చేయడం సాధ్య పడదట, కావున దీని ఆశ వదలుకొని మరో బోరింగు పంపుకై ప్రయత్నించాలి

క్రొత్త సిగరెట్ వెలిగించిన ఆ మెకానిక్ గారు, అయినా మా రిపోర్టు ప్రకారం ఇది డెబ్బై అడుగు లుండాలి కానీ ఇది యాభై అడుగులే వేసివుంది అందులోను పైపులు నలభై అడుగుల వరకే వేయడం జరిగింది, అంటూ తన నిజాయితిని తెలపు కొన్ని మాటలతో, ఇరవై అడుగుల లోతు పది అడుగుల పైపు ఏమైందో తెలియని అయోమయ పరిస్థితిలో పడ్డాడు రాజీవ్

మునిసిపల్ ఆఫీస్ చుట్టూ తిరగడంతో అంత వరకూ తనకు తెలియని, నీటి రాజకీయాలు చాలా తెలుసుకోగలిగాడు పట్టణానికి దగ్గరలో తల పెట్టిన సమ్మర్ స్టోరేజి ట్యాంక్ ఎందుకు పూర్తికాలేదనే విషయం కూడా తెలుసుకొన్నాడు అనవసరంగా ప్రజాధనం తాత్కాలిక కంటి తుడుపుతో కోట్ల కొద్ది వెచ్చించే పథకాలు తెలుసు కొన్నాడు ఇలాంటి వాటి జాబితాలోవే, రెండు ప్రశ్నలు మాత్రం, రాజీవ్‌కు కొరుకుడు పడలేదు

అందులో ఒకటి , ఇంత వరకూ వేసిన బోరింగ్ పంపుల్లో నీటి మట్టం తగ్గి, నిరుపయోగ మైనా ఆ విషయమై జాగ్రత్తలు తీసుకొనక, క్రొత్త బోరింగులకై కోట్ల కొలదీ ధనం వృథా చేయడం ఇలాగే కొన్నేళ్ళుగా సాగే పక్షంలో, ఈ ప్రాంతంలో నీరు తీయడానికై ప్రస్తుతం, మనం చమురు నిక్షేపాలకై త్రవ్వకాలు చేస్తున్నట్లుగా చేయాల్సి వుంటుంది ఇంత వరకూ ఖర్చు పెట్టిన ధనంతో టి క్రమేపి, శాశ్వత పరిష్కారంగా ఏ జీవనదినో ఈ శాశ్వత నీటి కరువు ప్రాంతానికి తరలించి సస్యశ్యామలంగా మార్చి యుండవచ్చును

ఇక రెండవది నీలగిరి వృక్షాల పెంపకం వల్ల నీటి ఎద్దడి ఎక్కువయ్యే ప్రమాదం వుందని తెలిసిన, ప్రభుత్వమే ఈ ప్రాంతంలో వాటి పెంపకానికై ఎక్కువ ప్రోత్సాహ మివ్వడము ఈ రెండు విషయాలు తల పగిలేలా ఆలోచించినా, రాజీవ్‌కు అర్థం కావడం లేదు కారణం వీటన్నిట వెనుకా స్వార్థపరమైన రాజకీయాలుండటం వల్లనే, అర్థం కాని సమస్యలెదురైతే, నిట్టూర్చడం అలవాటు

అదే ధోరణిలో నిట్టూర్చిన రాజీవ్, అదేంటి నేను లేచి వెళ్లి ఎంత సేపయ్యింది ఇంకా మీరు అలా దేవుని పటం వైపు చూస్తూ నమస్కరిస్తున్నారు క్రొత్తగా సుప్రభాతం మొదలెట్టారా" అంటూ నిండు బిందెతో వచ్చిన భార్య వైపు ఆశ్చర్యంగా చూసాడు రాజీవ్

త్వరగా కానివ్వండి, అవతల మిగిలిన మూడు బిందెలు పట్టి వుంచాను వీలైతే ఈ రోజు మన బాత్ రూంలో కూడా నీరు నింపుకో వచ్చు' నంటూ, కొళాయి వస్తున్న స్పీడును వర్ణిస్తూ, తను లాఘవంతో ఎలా నాలుగు బిందెలు సాధించిందో చెపుతున్న భార్య మాటలు వింటూ, నిన్నటి వరకూ త్రాగడానికై రెండు చెంబుల నీళ్ళంటే చాలన్న మనిషేనా? అని ఆశ్చర్య పడుతూ ఇంతవరకూ జరిగిన తతంగాలన్నింటికి మూల కారణమైన ఆ కొళాయి గారిని దర్శించే పుద్దేశ్యంతో బయలు దేరాడు

ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి మనస్సు బాధతో మూల్గింది చేంతాడులా అప్పటికే కొళాయి వద్ద నుండి వీధి మధ్యలో వరకూ బిందెలు, బక్కెట్లు క్యూలో వేచివున్నాయి ఆ దృశ్యం, ఉదయం నుండి ఏమితినని అన్నార్తులు పెళ్లి పందిరి వద్ద, పెళ్లి వారు దయతో పెట్టే బిక్ష కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నట్లుగా రాజీవ్‌కు తోచింది

ఖర్మ అపుడే కొళాయి ఆగిపోయిందండి . అంటూ చంకలో బిందెతో పాటు మరో చేతిలో కూడా బిందెతో, ఆలశ్యమైతే ఎవరు లాక్కుంటారో అన్నట్లుగా వస్తూ, అలా నిలుచుండి పోయారేంటి? త్వరగా అక్కడ పట్టి వుంచిన బిందె తీసుకురండి, లేకుంటే ఆ నీళ్లవరైనా తీసుకుంటారు ' అంటూ తొందర చేస్తూ ఇంటవైపు వేగంగా కదిలింది శ్రీమతిగారు

భార్య హెచ్చరికతో వేగంగా వెళ్లిన రాజీవ్‌ను చూసి అక్కడి ఖాళీ బిందె వెక్కిరించింది తమ ఎదురింటి పిన్ని గారూ వేగంగా నిండు బిందెతో వెనక్కి తిరిగి తన్ను చూస్తూ , పోవడం కనిపించింది త్రాగే నీటిని కూడా దొంగిలించే . స్థితికి ప్రజలను దిగజార్చిన ఈ ప్రజాస్వామ్యాన్ని ఏమనాలో, అర్థంకాని రాజీవ్ కుమార్ ఖాళీ బిందె నూపుకుంటూ ఇంటి దారి పట్టాడు □

## మూత్రపిండాలలోని రాళ్ళను నివారించే కొత్త సాధనం!

నీటిలో ప్రేలుడు పదార్థాలను ప్రేల్చడం ద్వారా ఉత్పన్నమయ్యే ఉష్ణ తరంగాలనుపయోగించి మూత్రపిండాలలోని రాళ్ళను ధ్వంసం చేసే నూతన సాధనాన్ని తోహోకు విశ్వ విద్యాలయానికి చెందిన మూత్రవయవ వైద్య నిపుణులు కనుగొన్నారు వ్యాధిగ్రస్తునికి అమర్చేందుకు వీలైన అండాకారపు నీటి టాంకు తీసుకుని అందులో రోగికి ఉరోభాగం వరకు నీటినిపోసి, అందులో 10 గ్రాముల అజైద్ ప్లంబమ్ ప్రేలుడు పదార్థాన్ని పేలిస్తే వెలువడే ఉష్ణ తరంగాలు రోగి శరీరంలోని మూత్రాశయ రాళ్ళను ధ్వంసం చేస్తాయి